ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

సోమవారం 2 డిసెంబరు 2024



మనుబోలు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కండలేరు



కావలి రూరల్ : ఈదురు గాలులకు తుమ్మలపెంట రోడ్డులో నేలకూలిన విద్యుత్ స్తంభాలు



నెల్లూరులోని తల్పగిరి కాలనీని చుట్టుముట్టిన వర్షపు నీరు

- తుఫాన్ ప్రభావంతో రోజంతా ఒకటే వాన
- జిల్లాలో సరాసరి వర్షపాతం 43.5 మి.మీ
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం



చిట్రగుంట : తీరప్రాంతంలో ఎగసి పడుతున్న సముద్రపు అలలు

తప్పిన ముప్పు

నెల్లూరు/నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎడతెరపిలేని వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిశాయి. ఆతర్వాత కొంత తెరపిచ్చినా సాయంత్రం మళ్లీ చినుకులు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లూరు నగరంలో పలు చోట్ల రోడ్లపై నీరు పారింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతా లను పర్యవేక్షించడంతో పాటు పెన్నా పరివాహకంలో వర్షా లను అంచనా వేస్తూ జాగ్రత్తలు తీసుకుంది. ఎట్టకేలకు జిల్లా తుఫాన్ ముప్పు తప్పింది. భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది. కాగా ఈ వర్షాలవల్ల ఎక్కడా పంట నష్టం జరగలేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

● తీరం దాటినా వర్షం

ఫెంగల్ తుఫాన్ తీరందాటినా జిల్లాలో వర్షం పడుతూనే ఉంది. తుఫాన్ తీవ్ర అల్పపీడనంగా మారిందని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో సోమ, మంగళవా రాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, 40-60కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

● సగటు వర్షపాతం 43.5 మి.మీ

జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 43.5మి.మీగా నమోదైంది. అత్యధికంగా మనుబోలులో 153.2 మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. పడిం ది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు... ఇందుకూరుపేటలో 110.2, రాపూరు 90.6, నెల్లూరు రూరల్ 85.8, పొదలకూరు 84.8, కొడవలూరు 81.8, ముత్తుకూరు 79.2, బుచ్చి 77.6, సైదాపురం 74.2, టీపీ గూడూరు 72.2, అల్లూరు 70.4, వెంకటాచలం 69.4, కోవూరు 66.4, నెల్లూరు అర్బన్ 63, దగదర్తి 62.6, విడవలూరు 51.6, సంగం 51.4, కలువాయి 41.8, బోగోలు 38.2, ఆత్మకూరు 31.6, చేజర్ల 30.6, కావలి 22.8, ఏఎస్‌పేట 21.6 జలదంకి 20.2, అనంతసాగరం 17.4, కలిగిరి 14.6, ఉలవపాడు 12.4, కందుకూరు 9.2, వలేటివారిపాలెం 9, కాండాపురం7, మర్రిపాడు 6.2, వింజమూరు 6.2, వింజమూరు 6.2, గుడ్లూరు 6, లింగసముద్రం 4.2, దుత్తలూరు 3, ఉదయగిరి 2.8, సీతారాంపురంలలో 2 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



రాపూరు : నీటితో కళకళలాడుతున్న కండలేరు జలాశయం

● సోమశిలకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 6,050 క్యూసెక్కుల వస్తుండగా, ఆదివారానికి 6,919 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 69.628 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 2000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100, డెల్టాకు 1800 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

● కండలేరుకు జలకళ

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం నిండుజలాలతో కళకళలాడుతోంది. 68టీఎంసీలు పూర్తి సామర్థ్యం కాగా, ఆదివారం నాటికి నీటి నిల్వ 53 టీఎంసీలను దాటింది. తుఫాన్ ప్రభావంతో ఇన్‌ఫ్లో 4810 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1095 క్యూసెక్కులుగా ఉన్నది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది.

- ఉదయం, సాయంత్రం యాప్‌లో హాజరు వేసుకోవాలి
- సాయంత్రం వరకు ఆఫీసులోనే కూర్చోవాలి
- సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశాలు
- ఒకపూట హాజరు వేస్తే అది సెలవు లెక్కే..!
- విధులకు డుమ్మా కొడుతున్న వారి ఆటలకు చెక్
- నేటి నుంచి అమలు



ఇష్టారాజ్యం

ఇక చెల్లదు..!

నెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం నెల్లూరు నగరంలో కార్పొరేషన్ కమిషనర్ ఓ సచివాలయానికి వెళ్లగా అక్కడ సిబ్బంది లేరు... ఆ తర్వాత ఆయనే మరోసారి ఇంకో సచివాలయానికి వెళ్లగా, మధ్యాహ్నం మూడు గంటలకే తాళాలు వేసి సిబ్బంది అంతా వెళ్లిపోయారు... ఈ రెండు సంఘటనలు పాఠకులకు గుర్తుండే ఉంటుంది. అయితే, ఇకపై సచివాలయాల్లో ఇలాంటి ఆటలు సాగవు. ఒక పద్ధతి అంటూ లేకుండా ఎప్పుడో రావడం, ఇష్టారీతిన వెళ్లిపోవడం ఇక కుదరదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయాల్లో కూర్చోవాల్సిందే.. పని చేయాల్సిందే..! సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

● ముఖహాజరు తప్పనిసరి

సచివాలయ ఉద్యోగులకు ముఖహాజరు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు పద్ధతి అమల్లో ఉన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఓ పూట యాప్‌లో హాజరు వేసుకుంటే సరిపోయేది. కానీ ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పింది. ప్రతీ ఉద్యోగి రోజూ రెండు పూటలా యాప్‌లో హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10 గంటలకు కచ్చితంగా సచివాలయానికి చేరుకొని హాజరు వేసుకోవాలి. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు యాప్‌లో హాజరు వేసుకున్నాకే తిరిగి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయం ఉన్న కోఆర్డినేట్స్‌కు 500 మీటర్లలోపే వేయాలి. ఎక్కడో కూర్చొని హాజరు వేసుకుందామంటే వీలుకాదు. రెండు పూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి ఆ రోజు విధులకు హాజరైనట్లు పరిగణిస్తారు. ఇప్పటి వరకూ రోజులో ఒక పూట హాజరు వేసి సచివాలయ సిబ్బంది వెళ్లిపోయేవారు. కొందరు విధులకు డుమ్మా కొడుతూ ఉండేవారు. పనివేళల్లో సచివాలయాల్లో ఉండకుండా ఏదో ఒక సమయంలో సచివాలయానికి వచ్చి హాజరు వేసుకొని వెళ్లిపోయేవారు.

> సోమవారం నుంచి రెండు పూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరి ఈ సారైనా ఈ హాజరు విధానాన్ని పటిష్ఠంగా అమలు చేస్తారా..? లేక గతంలో మాదిరి కొన్నాళ్లకు మళ్లీ వదిలేస్తారా..? అన్నది వేచి చూడాలి. కాగా దీనిపై సచివాలయాల జిల్లా నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారిని సంప్రదించగా సచివాలయ సిబ్బంది సోమవారం (నేటి) నుంచి రెండు పూటలా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించామని తెలిపారు.

నేటి నుంచి అమలు

● సుపరిపాలన దిశగా...

జిల్లాలో 769 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 6300 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కో సచివాలయంలో సరాసరి పది విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారు. ప్రజలకు ఏ పని జరగాలన్నా ముందు సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడి సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ సమయానికి రాకపోతుండడం, పనివేళల కన్నా ముందే వెళ్లిపోతుండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. చిన్న పనికి కూడా సామాన్యులు రెండు,మూడు సార్లు సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. మండల స్థాయి అధికారులకు కూడా ఇది సమస్యగా మారింది. సమయపాలన పాటించని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నా , ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. సుపరిపాల కోసం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేస్తే అక్కడ పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల మూలంగా ఆ విధానం అభాసుపాలవుతోంది. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఇటీవల ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టింది. అక్కడి సిబ్బందిలో బాధ్యత పెంచేందుకు హాజరు నిబంధనను కఠినతరం చేసింది.

కొత్త రేషన్‌కార్డులకు శ్రీకారం

విభజన, మార్పు,చేర్పులకు అవకాశం

సంక్రాంతి కానుకగా అందజేత

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అర్హుల్లో ఆనందం

నేటి నుంచి

దరఖాస్తులు

నెల్లూరు (హరనాథపురం)/సంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు కొత్తగా రేషన్‌కార్డులను పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సోమవారం (నేటి) నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు జారీ చేసింది. కొత్తకార్డులే కాదు.. ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గత ప్రభుత్వం రేషన్ పంపిణీని ఓ ప్రహసనంగా మార్చేసింది. అర్హులకు కార్డులు అందించే విషయంలో తీవ్రజాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే పనిలో భాగంలో అర్హులకు రేషన్ కార్డుల పంపిణీకి అన్నీ చర్యలు చేపట్టింది. ఈనెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించి, సంక్రాంతి కానుకగా కొత్త కార్డులు అందచేయనున్నది.

● పాతవాటి స్థానే కొత్తవి

ప్రస్తుతమున్న రేషన్‌కార్డుల స్థానంలో కొత్తవి కూడా అందచేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డులకు రంగుమార్చింది. అంతేకాక బియ్యం కార్డులు జారీ చేసింది. రేషన్‌కార్డుపై జగన్, రాజశేఖర్‌రెడ్డిల ఫొటోలు ముద్రించి లబ్ధిదారులకు అందచేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజముద్రతో రేషన్‌కార్డుల డిజైన్ మార్చాలని నిర్ణయించింది. లేత పసుపు రంగుకార్డుపై ప్రభుత్వ అధికార చిహ్నం ఉన్న నమూనాతో కార్డును రూపొందించినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆమోదం తరువాత వీటిని పంపిణీ చేయనున్నారు.

● అన్నింటికీ ప్రామాణికం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, దీపం-2 పథకం లబ్ధి, వితంతు, దివ్యాంగులు, వృద్ధులకు పింఛను మంజూరుకు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలో ప్రస్తుతం 7.22 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే చాలామంది వివాహమైనవారు ఉన్నారు. వీరికి పిల్లలు పుట్టినా కార్డుల్లో పేర్లు లేవు. చాలా కాలం నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో సంక్షేమ పథకాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డీఎస్వో కార్యాలయం

● సచివాలయాల్లో దరఖాస్తు

కొత్త రేషన్‌కార్డులు పొందటానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్‌కార్డుతో సచివాలయాలకి వెళ్లి, కొత్తకార్డుకోసం, ప్రస్తుతం ఉన్న కార్డుల్లో మార్పులు చేసుకోడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా కొత్తవాటికి సుమారుగా 10 నుంచి 20 వేలమంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా రేషన్‌కార్డుల కోసం నేటి (సోమవారం) నుంచి సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. కార్డు నుంచి పేరు తొలగింపునకు, పేర్ల రద్దుకు, మార్పులు,చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశం ఈనెలాఖరు వరకు ఉంటుంది.

\- డీవీ రమణ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

హిజ్రాల్లో ఆధిపత్య పోరు

- పాతకక్షల నేపథ్యంలో హాసిని హత్య
- నిందితులు 12 మంది అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు, మరో ఇద్దరు
- తెరవెనుక సూత్రధారి అలేఖ్య
- హత్యోదంతంలో పాతనేరస్థుల హస్తం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హాసిని... ఈమె ఓ ట్రాన్స్‌జెండర్... అనతికాలంలోనే రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ట్రాన్స్‌జెండర్లకు నాయకురాలిగా ఎదిగింది.. ఆమె ఉంటే తాము ఎదగలేమని మరికొందరు ట్రాన్స్‌జెండర్లు భావించారు.. హాసినీని ఎలాగైనా అంతమొందించాలని పగబట్టారు.. ఆమెతో వైరమున్న మరికొందరితో చేతులు కలిపారు. అందరూ కలిసి కిరాయి హంతకులతో రూ.20 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ హంతక ముఠా పక్కా స్కెచ్‌తో హాసినీని కత్తులతో విచక్షణరహితంగా పొడిచి హత్య చేసింది. ఇటీవల జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. సుపారీ ఇచ్చిన ట్రాన్స్‌జెండర్ నాయకురాలు అలేఖ్య, మరో హిజ్రాతో పాటు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో 15మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతను చిక్కితే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

● కుగ్రామం నుంచి అంతర్రాష్ట్ర స్థాయికి..

తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని గ్రామస్థాయి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ హిజ్రాలకు నాయకురాలిగా ఎదిగింది. అది చూసి ఓర్వలేక ఆమె బతికి ఉంటే తమ మనుగడ ప్రశ్నార్థకమని మాజీ నాయకురాళ్లు భావించారు. పక్కా స్కెచ్ వేసి అంతమొందించారు.



విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● రూ.20 లక్షల సుపారీ

నెల్లూరు నగరానికి చెందిన పాత నేరస్థుడు భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా దొరతోపు కాలనీకి చెందిన వంశీ కృష్ణ, అల్లీపురానికి చెందిన కార్తీక్, నాలు గో మైలుకు చెందిన సుబ్రహ్మణ్యం, మస్తాన్ వలీ, వెంకటాద్రి, ఇందుకూరు పేట మండలం జేజేపేటకు చెందిన వంశీ, నాలుగోమైలుకి చెందిన ఓ బాలుడిని, మార్టూరు మండలం ఇసుకదర్శికి చెందిన ఎం రామును టాన్స్‌జెండర్లు సంప్రదించారు. హాసినిని అడ్డుతొలగిస్తే రూ.20 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొని, కొంత నగదు ముందుగానే ఇచ్చారు. దీంతో నిందితులు నెల నుంచి హాసిని కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె పక్కనే ఉండే ఓ హిజ్రాను మచ్చి క చేసుకుని హాసిని కదలి కలు తెలుసుకుంటూ వచ్చారు. ఈ నెల 26వ తేదీ హాసిని స్వగ్రామంలోని ఆలయం వద్దకు వెళ్లి వస్తుండగా టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద కాపు కాచి పాశవికంగా హత్యచేసి పరారయ్యారు.

● అతను దొరికితే..

ఈ కేసులో సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు మాత్రం దొరకలేదు. ఆ వ్యక్తి ఈ ఏడాది వినాయక చవితి ఉత్స వాలకు హిజ్రా నాయకురాలు అలేఖ్య సాయంతో కొందరు హిజ్రాలను తెలం గాణ నుంచి పిలిపించి ఇక్కడ కార్యక్ర మాలను ఏర్పాటు చేయించారు. మన రాష్ట్రంలో హిజ్రాలు లేరా.. పక్క రాష్ట్రం నుంచి తెప్పించాల్నా.. అంటూ హాసిని అప్పుడు వాళ్లతో గొడవపడి అతడిపై దాడి చేయించిందని, దీంతో అతను పగ పెంచుకొని హత్యకు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో పలు చిక్కుముడులు వీడాల్సి ఉంది. అసలు హాసిని ప్రయాణం చేసిన కారు డ్రైవర్ ఏమయ్యాడు. ఈ కేసులో ఎంతమంది పాత్ర ఉందనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు దొరికితే అన్నీ బయటకు వస్తాయి.

రెడ్ రిబ్బన్‌గా విద్యార్థులు, అధ్యాపకులు

ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. జేబీ డిగ్రీ కళాశాలలో పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు రెడ్ రిబ్బన్ ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రిలు విద్యార్థులను అభినందించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష లేకుండా స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ వసుంధరాదేవి తెలిపారు. అలాగే రెడ్‌క్రాస్‌లో టీంసేవియర్స్ సంస్థ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించి బాధితులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

- కావలిటౌన్,(ఆంధ్రజ్యోతి)



బ్రహ్మేశ్వరుడికి అన్నాభిషేకం

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షి సమేత బ్రహ్మేశ్వరాలయంలో కార్తీక అమావాస్య సందర్భంగా ఆదివారం స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పీర్ల మాధవ్, కవిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



జలదంకి మండలం జమ్మలపాలెం ఎస్టీకాలనీలో నివాస గృహాల ఎదురుగా 11 కేవీ విద్యుత్ లైన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం చూస్తే ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఓ పక్కకు ఒరిగిపోయిన ఈ స్తంభం నేలకొరిగితే దీంతోపాటు అటూ ఇటూ మరో రెండు స్తంభాలు కూడా నేలకొరుగుతాయి. అదేజరిగితే ఎంత ప్రమాదమో చెప్పలేం. దీంతో కాలనీలోని గిరిజనులు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే ఓ వైపునకు ఒరిగిన ఈ స్తంభానికి స్థానికులు చెక్కలు అడ్డం పెట్టి ఉన్నారు. ఈ చెక్కలు దానిని ఎంతవరకు పడకుండా అడ్డుకుంటాయన్నది ఇట్టే చెప్పొచ్చు. ఒరిగిన ఈ స్తంభం తుఫాన్ ప్రభావంతో ఆదివారం వీచిన గాలులకు ఎక్కడ గృహాలపై పడుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని గిరిజనులు ట్రాన్స్‌కో సిబ్బందికి పలు దఫాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- జలదంకి,(ఆంధ్రజ్యోతి)



మేకల కాపరి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన సీఐ, ఎస్ఐ

కావలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కావలి సబ్‌డివిజన్ పరిధిలోని కొండాపురం మండలం గానుగపెంటలో మేకల కాపరి బంకా తిరిపాలు (52) హత్య కేసులో నిందితుడు కావడి మల్లి అలియాస్ గురు నాథం మాల్యాద్రిని అరెస్టు చేసినట్లు కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కలిగిరి సీఐ పీవీ నారాయణ, కొండాపురం ఎస్ఐ వెంకట్రావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సంగం మండలం తరుణవాయికి చెందిన గురు నాథం మాల్యాద్రి కొంతకాలం గానుగపెంటలో పశువులను కాపరిగా పనిచేసి తరువాత కొండాపురంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో గానుగపెంటకు చెందిన బంకా తిరుపాలు గత నెల 27వ తేదీన మేకలను మేపుకు నేందుకు అడవికి వెళ్లాడు. అదేరోజు ఆ మేకలను అపహరించి తీసుకెళ్లేందుకు అడవికి వెళ్లిన మాల్యాద్రి ఒంటరిగా ఉన్న తిరుపాలుపై కత్తితో దాడి చేసి పొడిచాడు. అతను స్పృహతప్పి పడిపోవడంతో 25 మేకలను తోలుకుని వెళ్లాడు. వాటిలో రెండు మేకలు తప్పించుకుని సాయంత్రానికి ఇంటికి వచ్చి తిరిపాలు రాకపోవడంతో ఆందోళనతో ఆయన భార్య ధనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే మేకలను తోలుకుని వెళుతున్న మాల్యాద్రి మార్గమధ్యంలో అగ్రహారం గ్రామంలో రెండు మేకలను కారుచౌకగా విక్రయిస్తుండటంతో దీనిపై అనుమానం వచ్చిన ఓ వ్యక్తి ఆ ఘటనను సెల్ ఫోన్ ద్వారా వీడియో తీస్తుండటంతో మాల్యాద్రి అక్కడ నుంచి పరారై బుచ్చిరెడ్డిపాలెం వెళ్లాడు. ఈ సంఘటనపై కొండాపురం, కలిగిరి, వింజమూరు ఎస్ఐలతో కలిసి రెండు టీమ్‌లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టా రు. ఈ క్రమంలో తాను కత్తితో పొడిచిన తిరుపాలు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న నిందితుడు మాల్యాద్రి పోలీసులు పట్టుకుంటే కొడతారనే భయంతో సత్యవోలుకు చెందిన వీఆర్వో ద్వారా కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీనిపై విచారిం చిన పోలీసులు ఆయనను శనివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బుచ్చిలో బాలిక అదృశ్యం.. బాపట్లలో ప్రత్యక్షం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్ నుంచి శనివారం అర్ధరాత్రి అదృశ్యమైన 13 ఏళ్ల బాలిక ఆదివారం బాపట్ల జిల్లా కొరిసిపాడులో ప్రత్యక్షమైంది. ఈ విషయాన్ని ఆదివారం సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన తిరువీధుల సురేష్, చెంచుకుమారిల కుమార్తె కారుణ్యకు మూగ, చెవుడు. ఈ బాలిక గత ఏడాది నుంచి ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని బధిరుల పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. ఈ క్రమంలో 2నెలలుగా ఆ బాలికకు ఆరోగ్యం బాగులేకపోవడంతో తల్లి తీసుకెళ్లింది. శనివారం సాయంత్రం స్కూలుకు తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్లింది. అదే రాత్రి బాలిక గోడదూకి వెళ్లిపోయిందని హాస్టల్ నిర్వాహకులు బుచ్చి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వేకువజామున 3గంటలకు బాలిక తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో వారు బాలిక ఆచూకి కోసం బంధువులకు సమాచారమిచ్చి పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. హాస్టల్ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి 7గంటలకు బాలిక బాపట్ల జిల్లా కొరిసిపాడులోని తన పిన్నమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు సీఐ శ్రీనావాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. కాగా హాస్టల్‌లో ఓ ఆయా తరచూ కొడుతూ వేధిస్తుంటుందని, అందువల్లే తమ బిడ్డ వెళ్లిపోయిందని తల్లి చెంచుకుమారి ఆవేదన వ్యక్తం చేశారు.

బెల్టు దుకాణంపై ఎక్సైజ్ అధికారుల దాడి

- 13 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కావలి మండలం చెన్నాయపాలెం పంచాయతీ పాముగుంటపాలెంలో అక్రమంగా ఇర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం విక్రయిస్తున్న పతంగి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని అతని నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెం దాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరు వారిపాళెంకు చెందిన చల్లా కృష్ణయ్య (58) వారం రోజుల కిందట కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు చల్లా సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి ..

వెంకటాచలం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం రాత్రి సుమారు 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి బురాన్‌పూర్ వద్ద రహదారి దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరన్న వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : రైలుకిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరులోని నక్కలోళ్ల సెంటర్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలుపట్టాలపై ఆదివారం ఈ ఘటన జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నలు పురంగు ఫుల్‌హ్యాండ్స్ బనియన్, బులుగు, ఆచు పచ్చ లుంగీ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్ఐ జీ మాలకొండయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7378
వెండి కిలో ధర	రూ. 91,900
వెండి ఒక గ్రాము	రూ.94.90

విద్యార్థి అదృశ్యం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని ఓ ప్రైవేట్ కళాశాల నుంచి ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. సీఐ జీ వేణు అందించిన వివరాల మేరకు.. సైదాపురం మండలానికి చెందిన జశ్వంత్ యాదవ్ వావిలేటిపాడులోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం నుంచి హాస్టల్ గదిలో కనిపించకపోవడంతో కళాశాల నిర్వాహకులు విద్యార్థి తండ్రి దొరస్వామికి తెలిపారు. అతను అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

2,601 పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం

- డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 2,601 పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బడివైపు ఒక అడుగు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7న అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల నడుమ ఒక బలమైన అనుబంధాన్ని ఏర్పరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. తల్లిదండ్రులందరూ తప్పనిరిగా హాజరై విద్యార్థుల బోధనా సామర్థ్యాలు, నడవడిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించి ఉపాధ్యాయుల కు సహకరించాలని కోరారు. పాఠశాలల అభివృద్ధి, చేపడుతున్న కార్యక్రమా లపై తల్లిదండ్రులతో చర్చించి వారి సూచనలు, సలహాలు తీసుకుని పాటిస్తామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరారు.

మేల్కోకుంటే ముప్పే!

- జిల్లాలో భారీగా పరిశ్రమలు
- సముద్ర తీర ప్రాంతాల్లో ప్రబలుతున్న కాలుష్యం
- రోగాల బారిన ప్రజలు
- పంటలు, జీవజాలంపై ప్రభావం
- అదుపుచేయకుంటే భవిష్యత్తు ప్రమాదకరం
- నేడు జాతీయ కాలుష్య నివారణ దినం



ముత్తుకూరు: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తీరప్రాం తాల్లో కాలుష్యం ఎక్కువగా ఉంది. తీరం వెంబడి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఏర్పడటంతో నీరు, భూమి, గాలి కలుషితమవుతున్నాయి. ప్రత్యే కించి థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల వాతావరణ కాలుష్యం అధికమైంది. కాలుష్య నియంత్రణకు పరి శ్రమలు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోతుండ టంతో పరిసర గ్రామాల ప్రజలు, జీవాలు రోగాల బారిన పడుతున్నాయి. అయితే పటిష్టమైన చర్యలు చేపట్టి కాలుష్యాన్ని అదుపు చేయడం, పచ్చదనం పెంచడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టకపోతే భవిష్యత్తు లో జిల్లాలో పరిస్థితులు ప్రమాదకరంగా మారుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఈ ఏడాది జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా క్లీన్ ఎయిర్, గ్రీన్ ఎర్త్ అంటూ కేంద్ర ప్రభుత్వం నినాదాన్ని ఇచ్చింది. ఇదిలా ఉండగా పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్యం విషయానికి వస్తే నిబంధనల మేరకు కూబిక్ మీటరుకు 52 మైక్రో గ్రాములు ఉండటంతో ఇది సేఫ్ జిల్లాగా గుర్తింపు లభించడం ఊరట నిచ్చే అంశం.

జిల్లాలో వాయు కాలుష్యం స్థాయి...

సంవత్సరం	మైక్రోగాములు
2020-21	59
2021-22	60
2022-23	54
2023-24	52
2024-25	52

పంటలు, మత్స్య సంపదపై ప్రభావం

థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల వాటి నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గుతోంది. ఆక్వా సాగుకు భూములు పనికి రాకుండా పోతున్నాయి. దీనివల్ల ఆ పరిశ్రమే కనుమరుగయ్యే ప్రమాదం ఉందని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగు నీరు, సాగునీరు కలుషితమై మనుషులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సముద్రం లోని మత్స్య సంపద తరిగిపోయి మత్స్యకా రులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి విష వాయువులు జీవుల మనుగడకే ముప్పులా పరిణమిస్తు న్నాయి. వీటికి తోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగ డంతో క్లోరోఫ్లోరో కార్బన్ వంటి ప్రమాదకర రసాయానాలు వాతావరణంలోకి చేరి ఓజోన్ పొరను దెబ్బతీ స్తున్నాయి.

నిబంధనలు పాటించిన పరిశ్రమలెన్నో

పరిశ్రమలకు ప్రభుత్వం కేటాయించే భూమిలో 30 శాతం మొక్కలు పెంచాలనేది నిబంధన. అయితే దీనిని చాలా పరిశ్రమలు అనుసరించడం లేదు. ఒకవైపు కాలుష్యం పెరగడం, మరోవైపు తగినంతగా పచ్చదనం పెంచకపోవడంతో ఆ ప్రభావం స్థానికులపై పడుతోంది. ఇదిలా ఉంటే నేష నల్ గ్రీన్ ట్రిబ్యునల్ నియమించిన సంయుక్త కమిటీ జిల్లాలో కాలుష్యానికి కారణమవుతున్న కొన్ని పరిశ్రమలకు జరిమానా చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది. జిల్లాలో పరిశ్రమల నిర్వహణ, కాలుష్య నియంత్రణకు ఇది నిదర్శనం.

పక్కాగా నియంత్రణ చర్యలు

నియంత్రణ చర్యలు పక్కాగా అమలుచేస్తుండటంతో జిల్లాలో కాలుష్యం అదుపులో ఉంది. పట్టణాల్లో నమోదవుతున్న వాయు కాలుష్యం క్యూబిక్ మీటర్‌కు 52 మైక్రో గ్రాములుగా ఉంది. ఇది ఎంతో సేఫ్. జిల్లాలోని పరిశ్రమలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఆ మేరకు చర్యలు చేపడుతున్నాము. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి. కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము.

- అశోక్ కుమార్, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ

టీ-20లీగ్ పోటీలకు 6లోగా దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యం లో నిర్వహించే టీ-20 లీగ్ కమ్ నాకౌట్ పోటీలకు క్రీడా జట్లు ఈనెల 6వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రికెట్ జట్టు పేరుతో ఉన్న లెటర్ హెడ్ మీద 20 మంది సభ్యుల వివరాలు, ఆధార్ కార్డులు, ఫొటోలు, రూ.5వేల ప్రవేశ రుసుముతో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో ఎంట్రీ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. క్రీడాకారులు జిల్లాకు చెందినవారుగానీ, జిల్లాలో చదువుకుంటున్నవారుగానీ అయి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు నెల్లూరు ఫోన్ 9440536270, గూడూరు ఫోన్ 9985233061, కావలి ఫోన్ 9652745899, వెంకటగిరి ఫోన్ 9959722799 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు ప్రారంభం



రగ్బీ పోటీలో తలపడుతున్న కృష్ణా, సత్యసాయి జిల్లా బాలికల జట్లు

కావలిటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం సబ్ జూనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు ప్రారంభమయ్యాయి. 13 జిల్లాలకు చెందిన బాలబాలకల జట్లు పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ రగ్బీ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన క్రీడ అని, మన దేశంలో, రాష్ట్రంలో కూడా రగ్బీ క్రీడకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహణకు డీబీఎస్ వేదికగా మారేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రగ్బీ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతుల్లో జరుగుతున్న పోటీల్లో ఆదివారం వివిధ జిల్లాల బాలబాలికల జట్లు తలపడ్డాయని, సోమవారంతో పోటీలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ బాధ్యులు దామోదర్, వివిధ జిల్లాల ప్రతినిధులు చంద్రశేఖర్, యాసిన్, శంకర్‌వంశీ, మురళి పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య
- మాతా,శిశు మరణాలపై సమీక్ష

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గర్భిణులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్రతీ గర్భిణిని గుర్తించి పేర్లు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. ఆయన చాంబర్‌లో ఆదివారం మాతా,శిశు మరణాల సబ్ కమిటీ సమావేశమైంది. అక్టోబరు నెలలో జిల్లాలో జరిగిన రెండు మాతృ మరణాలు, 6 శిశు మరణాలపై సమీక్ష జరిపారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించాలని, హైరిస్క్ గర్భిణులకు ఎలాంటి ఆటంకం లేకుండా సంపూర్ణ ఆరోగ్య చికిత్సలు అందించాలని సూచించారు. వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖప్రసవం జరిగే వరకు పర్యవేక్షించాలన్నారు. అర్హులైన గర్భిణి, బాలింతలకు జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే పథకాలను అనుసంధానం చేయాలని కోరారు. ఈ సమీక్షలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ సింధు, డెమో కనకరత్నం, మంజుల, ఎస్‌వో సహన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీని నియంత్రించాలి

- నెల్లూరులో భారీ ప్రదర్శన
- పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నిర్మూలించాలంటూ నెల్లూరు నగరంలో ఆదివారం భారీ ప్రదర్శన జరిగింది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా గాంధీ బొమ్మ నుంచి సాగిన ఈ ప్రదర్శనలో భారీ సంఖ్యలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. అనంతరం పురమందిరంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ నివారణకు కృషి చేసిన వారికి పురస్కారాలు అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదన్నారు. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి నియంత్రణకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ తీవ్రత బాగా తగ్గిందన్నారు. ఆరోగ్య కేంద్రాలు, ఐసీటీసీ కేంద్రాల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అందరం హెచ్ఐవీ నివారణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డాక్టర్ గీతాలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, ఎన్ఎన్‌పీ ప్లస్, పీఎంపీ అసోసియేషన్, ఏసీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు పాల్గొన్నాయి.

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీంద్రబాబు

- నెల్లూరు డివిజన్ కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ అధ్యక్షుడిగా కే రవీంద్రబాబు ఎన్నికయ్యారు. నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పీ రవిశేఖర్, జాయింట్ సెక్రటరీగా ప్రసన్న, ట్రెజరర్‌గా సలీమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుమన్‌ను ఎన్నుకున్నారు. వారికి అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది శుభా కాంక్షలు తెలిపారు.

తక్కువ ధరకే బంగారమని మోసం

- గిల్టు నగలిచ్చి పరారీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకే బంగారు నగలు ఇస్తామని నమ్మించి రూ.లక్షలు తీసుకుని గిల్టు నగలిచ్చి ఉడాయిం చిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెంగళూరు నగరం వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో విశాల్ ఆనంద్ ఆనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నివసిస్తున్నా రు. నెలరోజుల కిందట ఆయన ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకే బంగారు నగలు ఇస్తామనే పోస్టు చూశారు. అందులో పేర్కొన్న సుబ్బారావు అనే వ్యక్తి నెంబరుకు ఫోన్ చేశారు. తమ వద్ద 12 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయ ని, వాటిని తక్కువ ధరకు ఇస్తామని సుబ్బారావు నమ్మబలికారు. ఆభరణాల కోసం గత నెల 30న విశాల్ ఆనంద్ తన స్నేహితుని తల్లి అనితతో కలిసి నెల్లూరుకు వచ్చారు. సుబ్బారావుకు ఫోన్‌చేయగా ఆయన వారి వద్దకు వచ్చి నగరంలోని సాయినగర్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు తీసుకెళ్లి బంగారు ఆభరణాలు చూపించారు. రూ.3.50 లక్షలు ఇస్తే ఆభరణాలు ఇస్తానని చెప్పారు. అవి నిజమైనవా నకిలీవా అని విశాల్ ప్రశ్నించగా పరీక్ష నిమిత్తం బ్రహ్మానంద పురంలోని ఓ కుదవ దుకాణం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించగా బంగారు ఆభరణాలే అని తేలింది. దీంతో రాత్రి ఏడుగంటల సమయంలో సుబ్బారావును ఇరగాళమ్మ సంఘం సమీపంలోని నెక్లెస్‌రోడ్డులో కలిశారు. వారు నగదు ఇవ్వగా సుబ్బారావు ఆయన చేతిలో ఉన్న బంగారు ఆభరణాల పార్శిల్ ఇచ్చి పారిపోయాడు. దీంతో బాధితులకు అనుమానం వచ్చి పార్శిల్ తెరచి చూడగా అందులో రోల్డ్‌గోల్డ్ నగలు కనిపించాయి. నిందితుడి కోసం చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవ డంతో ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలకు పాల్పడితే
పీడీ యాక్ట్ అమలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ, సీఐలు

కావలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) కొత్త చట్టాలు వచ్చాయని రౌడీషీటర్లు, సస్పెక్టర్లు జాగ్రత్తగా ఉండాలని నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలుచేస్తే జీవితాలు నాశనమవుతాయని కావలి డీఎస్పీ పీ శ్రీధర్ తెలిపారు. కావలి 1,2వ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్టర్లకు ఆదివారం కావలి పట్టణ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూము ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా రెండో పట్టణ సీఐ గిరిబాబు, రూరల్ సీఐ రాజేశ్వరరావుతో కలసి డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోకపోతే జీవితాంతం ఇబ్బందుల పడతారని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని నేరాలకు దూరంగా ఉంటే రౌడీషీట్లను తొలగిస్తామని చెప్పారు. నేరం చేయమని చెప్పే వారు, చేయించే వారు బాగుంటారని చేసిన వాళ్లే నష్టపోతారన్నారు. కావలిలో రౌడీయిజాన్ని సహించమని చెప్పారు. సత్ప్రవర్తన కలిగి రౌడీషీట్లు తొలగించే సమయంలో మళ్లీ ఏదైనా గొడవలతో ప్రమేయం ఉంటే మరో పదేళ్ల వరకు రౌడీషీట్లు కొనసాగతాయని, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకున్నా పోలీసుల అనుమతి తీసుకోవాలని, లేకపోతే రాత్రి బీట్ పోలీస్‌లు తనిఖీ చేస్తే మీరు ఇంట్లో లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాద్

ఆత్మకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో ఆదివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉన్నందున డ్రైనేజీల్లోని మురికి నీరు రోడ్ల మీదకు ప్రవహించకుండా ముందుస్తు చర్య లు చేపట్టారు. బస్టాండ్, సత్రం సెంటర్ తదితర వార్డుల్లోని కాలువల్లో పూడిక పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు అర్థరహితం : వైస్ ఎంపీపీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన వ్యక్తిగత కార్యదర్శిపై విమర్శలు చేయడం అర్థరహితమని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీ వాసులతో కలిసి ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల ఆనకట్ట ఆధునికీకరణ పనులపై వచ్చిన వదంతులను నమ్మి కొంతమంది గిట్టనివారు ఎమ్మెల్యే, పీఏపై బురదచల్లే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకే పాత గుత్తేదారుకు పని ఇచ్చారని, ఇందులో ఎలాంటి స్వార్థంలేదన్నారు. అర్థరహిత విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు దుస్తుల పంపిణీ



బాలలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దశరథరామిరెడ్డి

అల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు డీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో ఆదివారం మండలంలోని నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలోని 300 మంది అనాథ బాలబాలికలకు రూ2.50 లక్షల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. జూన్‌లో తమ తల్లి వర్ధంతిని పురస్కరించుకొని బాలలందరికీ నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామని డీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యుడు దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. అనంతరం అందరికీ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ రామచంద్ర శరత్‌బాబు, ట్రస్ట్ సీఈవో అనిల్‌కుమార్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు రామచంద్రరావు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో అమావాస్య ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవ అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సేవ అలవర్చుకోవాలని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మందిరం చైర్మన్ బొద్దులూరు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అనంతరం శాకాహారం గొప్పదనం వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాలొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి

వింజమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని జడ్పీటీసీ గంథం బాలకృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, దుత్తలూరు మండల కన్వీనర్ డి వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి)1: వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ26750 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

వైద్యాధికారిణి సేవలకు గుర్తింపు



ప్రశంసాపత్రం అందుకుంటున్న బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి మండలంలోని ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడం, పరీక్షలు చేయించడం, హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీలో మందులు సకాలంలో ఇప్పించడం తదితర సేవలు అందించారు. దీంతో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి నుంచి జిల్లాకేంద్రంలో ప్రశంసాపత్రం, మె మొంటో అందుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యబృందం, వైద్య సిబ్బంది తోపాటు మండల వాసులు వైద్యాధికారిణికి అభినందనలు తెలిపారు.

ఎండీయూ వాహనంపై తొలగని జగన్, వైఎస్ఆర్ బొమ్మలు




ఎండీయూ వాహనంపై తొలగించని జగన్, వైఎస్ఆర్ బొమ్మలు

బిట్రగుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు కోడ్ అమలులో భాగంగా పార్టీలకు సంబంధించి ప్రచారాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా నేటికీ ఎండీయూ వాహనాలపై జగన్, వైఎస్ఆర్ బొమ్మలు తొలగించలేదు. బోగోలు పంచాయతీలో ఆదివారం ఓ ఎండీయూ వాహనంపై జగన్, వైఎస్ఆర్ బొమ్మలను కనిపిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం పాలన వచ్చి 6 నెలలు కావస్తున్న వాటిని తొలగించే విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వాహనాలపై ఉన్న బొమ్మలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

నిండని చెరువులు... నిరాశలో రైతులు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆశించిన మేర కురవని వర్షాలు ● గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు



గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు



శనగ సాగుకు సిద్ధం చేసిన భూమి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయి.. చెరువులు నిండుతాయి.. పంటల సాగుకు ఇబ్బందుల్లేవనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అరకొరగా కురిసిన వర్షాలకు అత్యధిక చెరువుల్లో 20-40 శాతం కంటే నీరు తక్కువగా ఉంది. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లోనే వర్షాలు సమృద్ధిగా కురు స్తాయి. అయితే వరుణుడు ముఖం చాటేస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మరమ్మతులకు నోచుకోని చెరువులు

ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 245 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దశాబ్దాల తరబడి చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఉన్న అరకొర నీరు వృథా అవుతోంది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు వరప్రసాదిని అయిన పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయం పరిధిలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 11 అడుగుల మేర నీటిమట్టం ఉంది. ఇక మర్రివాట్ల, నక్కలగండి రిజర్వాయర్ల పరిస్థితి కూడా అలాగే ఉండడంతో ఈ నీటితో ఆరుతడి పంటలు కూడా కష్టమేనని, బోర్లలో సైతం నీరు అడుగంటిపోతోందని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే సాగులో ఉన్న మినుము, కంది, ఇతరత్రా పంటలు ఎండు దశకు చేరాయి. నియోజవకర్గంలో అత్యధికంగా వరికుంటపాడు, దుత్తలూరు, కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల్లో రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేస్తారు. రైతులు భూములు దుక్కులు దున్ని పంట సాగుకు వరుణుడి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఆశించిన మేర వర్షం కురవకపోవడంతో కొంతమంది రైతులు సాగుకు వెనుకడుగు వేస్తుండగా, మరికొంతమంది సాగు చేపట్టారు. ఏదిఏమైనా ఫెంగల్ తుపాన్ మెట్ట ప్రాంత రైతులు, ప్రజలకు నిరాశే మిగిల్చిందని చెప్పాలి.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించాలి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



సాగునీటి సంఘాల ఎన్నికలపై నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధపడినందున నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాలలో టీడీపీ కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా నాయకులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగునీటి వ్యవస్థను సర్వనాశనం చేశారని, నిధుల కేటాయింపు కూడా లేక సాగునీటి వనరులు దెబ్బతిన్నాయని విమర్శించారు. సాగునీటి చెరువులకు పునరుజ్జీవం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటిసంఘాల ఎన్నికలకు సమాయత్తమయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్త రేషన్‌కార్డులకు ఈనెల 2 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డులలో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో వివాహాలు అయిన వారు, రాజకీయ కారణాలతో రేషన్‌కార్డులు లేనివారు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే కార్డులలో మార్పులు, సభ్యుల తొలగింపు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు ప్రస్తుతం వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించి అర్హులందరికీ సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు అందజేస్తారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.



కావలిరూరల్ : ఒరిగిన స్తంభాలను పైకి లేపుతున్న యంత్రాలు



అల్లూరు : రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఎడతెరపిలేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

● లోతట్టు ప్రాంతాల జలమయం ● నీట మునిగిన వరి పొలాలు ● ఒరిగిన విద్యుత్ స్తంభాలు



సంగంలో జలమయమైన రోడ్డు

అల్లూరు,(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతోపాటు చెట్లు నేల కూలాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. తుపాన్ ధాటికి తీరప్రాంతాల్లో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. అదేవిధంగా వరి నాట్లు వేసుకున్న రైతులు ఆందోళన చెందారు. కొన్నిచోట్ల నీరు పోకపోవడంతో తమ పైర్లు నీటిటిలోనే ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతంలోని గ్రామాలు, పొలాలు జలదిగ్బంధమయ్యాయి. స్వాంపు ప్రాంతంలో నీరు చేరడంతో చెరువుని తలపిస్తోంది.

● కావలి రూరల్ : ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు కావలి మండలం ఆముదాలదిన్నె సమీపంలో ఆదివారం చెన్నాయపాలెం, తుమ్మలపెంట సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా జరిగే 33 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రూరల్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకాంత్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఈ శ్రీనివాసులురెడ్డి జోరు వానలో క్రేన్, ఎక్స్‌కవేటర్, మరో భారీ వాహనం, 15 మంది సిబ్బందితో నేలకొరిగిన స్తంభాలను పైకి లేపి యుద్ధ ప్రాతిపదికన 4 గంటల మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తక్కువ సమయంలో శ్రమించి మరమ్మతులు చేయించటం పట్ల ఏఈ, సిబ్బందిని పలువురు అభినందించారు.

● వలేటివారిపాలెం: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వలేటివారిపాలెంలోని బీసీ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పదేళ్ల క్రితం బీసీ కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు సిమెంట్లు రోడ్లు నిర్మించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు సిమెంటు పైపులు ఏర్పాటుచేశారు. అయితే సిమెంటు పైపుల్లోకి వర్షం నీళ్లతో పాటు మట్టి పోవడంతో పూడిపోయాయి. దీంతో వర్షం నీళ్లతో పాటు మురుగునీరు ముందుకు కదలక ఇళ్ల ప్రాంగణంలోనే నిలిచిపోతున్నాయి బీసీ కాలనీలోని డబ్బుగొట్టు కాశయ్య ఇంట్లోకి వర్షం నీరుచేరి దుర్గంధం వెద జల్లడంతో అంటువ్యాధులు ప్రబలుతాయో మోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి బీసీ కాలనీలో వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● సంగం: మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురు స్తున్న వర్షానికి వీధులు, రోడ్లు, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండ డంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోయారు.

● అనంతసాగరం : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువై వ్యాధులు ప్రబలుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు, కాలువల కింద 12వేల ఎకరాల్లో వరిసాగు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలు చల్లడంతో పాటు, కొన్నిచోట్ల నాట్లు కూడా పూర్తయ్యాయి. ఈక్రమంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందళన చెందుతున్నారు. అలాగే సోమశిల రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడగా అందులో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉధృతంగా కడలి

● బిట్రగుంట : తుపాను ప్రభావంతో ఆదివారం సముద్రపు అలలు ఉధృతంగా ఎగసి పడ్డాయి. బోగోలు మండల తూర్పు తీరప్రాంతం 10 కిలోమీటర్ల సమీపంలో ఉండటంతో తీవ్రంగా చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోయారు. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. ఇటీవల నాటిన వరి నీట మునిగిపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా వర్షం కొనసాగితే వేసిన పైరుతో పాటు మిగిలిన నారుమడులు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కరువు

● నత్త నడకన ఇళ్ల నిర్మాణం



దేవరాజుసురాయపల్లిలో బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

సీతారామపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వెనుకాడుతున్నారు. మండలంలో 629 మందికి ఇళ్లు మంజూరుకాగా ఇప్పటికి 248 గృహాలకు పునాదులు, 80 గృహాలకు స్లాబు వేశారు. 35 గృహాలు మాత్రమే పూర్తిగా నిర్మించారు. అందులో సీతారామపురం సచివాలయ పరిధిలో 33 గృహాలు పూర్తిగా నిర్మించగా, అయ్యవారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో కొన్ని గృహాలకు స్లాబులు వేశారు. మండలంలోని రెండు మూడు సచివాలయాల పరిధిలో మాత్రమే లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణాలు సాగిస్తున్నారు.

కాలనీల్లో కనీస సదుపాయాలు కరువు

కాలనీల్లో అవసరమైన కనీస మౌలిక సదుపాయాలైన రోడ్డు, నీరు, కరెంట్ వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వెనుకాడుతున్నారు. దేవరాజుసురాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులు కనీసం నీటి వసతి లేక సుదూర ప్రాంతం నుంచి బిందెలతో తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ప్రభుత్వం జనవరిలోగా మండలంలో కనీసం 76 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించినా నవంబరు 11వ తేదీకి కేవలం 16 ఇళ్లను మాత్రమే పూర్తిచేశారు. పునాది గుంతలు తీసి పట్టా రద్దుకాకుండా జాగ్రత్త పడ్డారు. కనీసం రోడ్డు, నీరు, కరెంట్ వసతులు లేకపోవడంతో ఇల్లు ఎలా కట్టుకోవాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఏర్పాటుచేసిన కాలనీలలో ఒక్కటంటే ఒక్కచోట కూడా విద్యుత్ సరఫరా ఇవ్వలేకపోవడం గత వైసీపీ ప్రభుత్వం పనితీరుకి అద్దం పడుతోందని మండలంలోని గృహ లబ్ధిదారులతోపాటు సాధారణ ప్రజలు సైతం బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి

● తోట శ్రీనివాసులు, ఎంఈవో-2, ఉదయగిరి



ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన విద్యా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

? నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట క్లాసు తీసుకుంటున్నారు. అలాగే ప్రతిరోజు ఉపాధ్యాయులు మోడల్ పేపరు పరీక్ష పెడుతున్నారు. జనవరి నుంచి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విజయదీపిక అనే మోడల్ పేపర్ల పుస్తకంతో పరీక్షలు నిర్వహిస్తాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

? జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా.

! మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, బిజ్జంపల్లి, ఉదయగిరి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చేస్తున్నాం.

? విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.

! ప్రభుత్వం అమలుచేసే విద్యా సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు చేపడుతున్నాం.

? మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పాటిస్తున్నారా.

! మధ్యాహ్న భోజనం పథకంలో ప్రభుత్వం సూచించిన మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఇటీవల ప్రభుత్వం భోజన నిర్వాహకులకు ధరలను సైతం పెంచడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సామూహిక రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కలువాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య సందర్భంగా ఆదివారం స్థానిక శివాలయంలో కలువాయి శివభక్తి మండలి ఆధ్వర్యంలో సామూహిక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సామూహిక దేవి ఖడ్గమాల పూజలు జరిగాయి. భక్తులకు అవసరమైన పూజా సామాగ్రిని శివభక్తి మండలి వారు ఉచితంగా అందజేశారు. భక్తులు సాంప్రదాయ దుస్తులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి నరసింహరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి ఏపీవో బదిలీ

కలువాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కలువాయి మండల ఏపీవో యం మురళీధరరావును కొండాపురం మండలానికి బదిలీ చేస్తూ డ్వామా పీడీ బి గంగాభవానీ ఉత్తర్వులు జారీ చేశారు. చేజర్ల మండలంలో పనిచేస్తున్న బి వెంకటేశ్వర్లుకు కలువాయి ఇన్‌చార్జి ఏపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కలువాయి మండలం చిన్న గోపవరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమా లపై గురువారం గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు భవానీ హర్ష స్వయంగా విచారణ జరిపారు. ఆయన చేసిన సూచనలు మేరకు తదుపరి చర్యలు నిమిత్తం కలువాయి ఏపీవోను బదిలీ చేసినట్లు డ్వామా పీడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం వితరణ



అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

జలదంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జలదంకిలో అయ్యప్ప మాలాధారణ భక్తులకు జరుగుతున్న 50 రోజుల నిత్య అన్నప్రసాద వితరణలో భాగంగా ఆదివారం లింగసముద్రం తహసీల్దారు సీతామహాలక్ష్మి అన్నప్రసాద వితరణ చేశారు. ఈమె గతంలో జలదంకి తహసీల్దారుగా పనిచేసినప్పటి నుంచి ప్రతి ఏటా ఒకరోజు అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప భజనలో పాల్గొన్న తహసీల్దారు తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్థులు, అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు ఆమెను అభినందించారు.





కృష్ణ జింకల కనువిందు

నెల్లూరు రూరల్ మండలం దొంతాలి గ్రామంలో కృష్ణ జింకలు కనువిందు చేస్తు న్నాయి. నగరం నుంచి పొదలకూరు వెళ్లే మార్గంలో నగర శివార్లకు ఆనుకుని ఉన్న దొంతాలి అడవిలో ఇవి సంచరిస్తున్నాయి. ఆదివారం ఆహారం కోసం బయటకు వచ్చిన ఈ వన జీవులు ఆంధ్రజ్యోతి కెమెరా కంట పడ్డాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఆకాశ దీప ఉద్వాసన

● ముగిసిన కార్తీక మాసోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉన్న సుందరేశ్వర స్వామికి కార్తీక మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆకాశ దీపానికి ఉద్వాసన చెప్పి, పోలి స్వర్గ పూజ చేశారు. రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అళహరి విజయకుమార్, ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేదపండితుడు రామకృష్ణ, ఈవో సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలి స్వర్గ పూజ చేస్తున్న అర్చకులు, చిత్రంలో రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత తదితరులు

ఘనంగా ఘంటసాల జయంతి

● ఉర్రూతలూగించిన సంగీత విభావరి


● సేవా బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో ఐఆర్ఎస్ మూర్తితో కలిసి నిర్వాహకుడు నీలకంఠం 103వ సారి రక్తదానం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు నగరంలోని పుర మందిరంలో ఆదివారం జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రిటైర్డ్ ఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు. అనంతరం ప్రముఖ తబలిస్ట్ శాంతికుమార్‌ను సత్కరించారు.



సంగీత విభావరిలో ఘంటసాల పాటలు పాడుతున్న కళాకారులు

చేశారు. ఈ కార్యక్రమంలో పిన్ను గంగాధర్, నెల్లూరు జిల్లా మాజీ పోలీస్ సిబ్బంది సంఘం ప్రెసిడెంట్ శ్రీహరి, సీనియర్ గాయకుడు ఆకుతోట రమణయ్య, ద్విగళ గాయకులు రామచంద్రరావు, పెంచలరెడ్డి, ప్రసాద్‌బాబు, సుజాత, లక్ష్మీ, కళాకారుల బృందాలు పాల్గొన్నాయి.



వదలని వాన

రాపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. పట్టణంలోని ప్రధాన వాణిజ్య వ్యాపారాలు జరిగే పాత బస్టాండ్ వర్షపు నీటితో నిండిపోవడం వలన పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పెంచలకోన జలపాతం భారీగా జాలువారడంతో అక్కడి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.



రాపూరు బస్టాండులో వర్షపు నీరు

సిటీ బస్సుల్లేక ప్రజల అవస్థలు

● ఆటోల్లో అదనపు చార్జీలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా ప్రైవేటు సిటీ బస్సులు తిరగడం లేదు. రవాణా శాఖ దాడులకు నిరసనగా సిటీ బస్సుల యాజమాన్యం, కార్మికులు బస్సులను



నిలిపివేశారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి నిత్యం టౌను బస్సుల్లో వేలాది మంది ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా దినసరి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిరు ఉద్యోగులకు ఆ బస్సులే ఆధారం. అయితే టౌనుబస్సులు నడవకపోవడంతో ఆటో చార్జీలు భగ్గుమంటున్నాయి. సాధారణంగా రూ.20 చార్జీ తీసుకునే దూరానికి ఇప్పుడు రూ.30 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. గత్యంతరం లేక ప్రజలు ఆటోల్లోనే అడిగినంత ఇచ్చి ప్రయాణిస్తున్నారు.

నెల్లూరుకు నగర హోదా వచ్చి దాదాపు 15 ఏళ్లయింది. అయినా నేటికీ అన్ని ప్రాంతాలకు ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడం గమనార్హం. నగరం అన్ని వైపులా సుమారు 10 కి.మీ. మేర విస్తరించింది. దీంతో శివారు ప్రాంతాలకు వెళ్లే వారు బస్సు సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోల వాళ్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. వీటికితోడు నగరంలో తిరిగే టౌను బస్సులు కూడా నిబంధనలు పాటించకపోతుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నగరం నలుచెరుగుల ఉండే ప్రాంతాల ప్రజలకు అనువుగా ఆర్టీసీ సిటీ బస్సులు నడపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

నేటి నుంచి మార్గశిర మాసం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాసానాం మార్గశిర్షోహం అని జగద్గురువు శ్రీకృష్ణుడు తెలిపారు. మాసాలన్నింటిలోకి మార్గశిరం అంతటి గొప్పదన్నమాట. ఈ మాసంలోనే కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడు జన్మించారు. కృష్ణ భగవానుడి నుంచి భగవద్గీత వెలువడింది కూడా ఈ నెలలోనే. మార్గశిరంతోనే హేమంత రుతువు మొదలవుతుంది. లక్ష్మీనారాయణుడికి ప్రీతిపాత్రమైన ఈ మాసంలో గురువారాలు లక్ష్మీపూజకు చాలా విశిష్టమైనవి. 7వతేదీ సుబ్రహ్మణ్యం షష్టి, 8న కాలభైరవాష్టమి, 11న గీతా జయంతి, 13న హనుమద్వ్రతం, 14న దత్త జయంతి వంటి పండుగలు వస్తున్నాయి. ఈనెలలోనే సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించడంతో ధనుర్మాసం (పండుగ నెల) ప్రారంభమవుతుంది. ధనుర్మాసంలో వైష్ణవాలయాల్లో ఉత్సవలు జరుగుతాయి. నిత్యం వేకువజామున తిరుప్పావై గానం చేస్తారు. యువతులు వివాహం కోసం కాత్యాయనీ వ్రతం ఆచరిస్తారు.

భారీ వర్షం

ముత్తుకూరు, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి) : తుఫాన్ ముప్పు తప్పడంతో మండలంలోని తీర ప్రాంత గ్రామాలు ఊపిరి పీల్చుకున్నాయి. తీరం దాటే సమయంలో, దాటిన తర్వాత భారీ వర్షం కుర వడంతో మండలంలో ఆదివారం ఉదయానికి 80 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత గాలులతో కూడిన చెదురుము దురు వర్షం తప్ప పెద్దగా ప్రభావం చూపించలేదు. మూడు రోజుల్లో కురిసిన వర్షాలకి గ్రామాల్లోని కాలనీలలో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. గాలులు తక్కువ కావడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో పొలాల్లో నీరు చేరి నారుమడులు నీట మునిగాయి. అయితే ఇప్పటివరకు కురిసిన వర్షం వల్ల పెద్దగా నష్టం ఉండదని, నీరు బయటకు వెళ్లిపోతుందని, ఇకపై వర్షాలు కురిస్తే నారుమళ్లు దెబ్బతింటాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు నారుమడుల్లో చేరిన నీటిని తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాల న్నారు. తుఫాన్ తీరం దాటినా, సముద్రంలో అలజడి ఉండడంతో మరో నాలుగు రోజుల పాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్ల వద్దని అధికారులు ఆదేశించారు. వర్షాలు, గాలు లకు విద్యుత్ లైన్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



పాటూరులో నీట మునిగిన వరినాట్లు

నీటమునిగిన వరినాట్లు

కోవూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరినాట్లు నీటమునిగి దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల వ్యవసాయశాఖాధికారులు ఓ వైపు వరినాట్లు వేయవద్దని హెచ్చరించినప్పటికీ రైతులు పెద్దసంఖ్యలో వరినాట్లు వేశారు. ఎక్కువ దినాలు వరి నాట్లు నీళ్లల్లో నానితే దెబ్బతినే ప్రమాద ముందని రైతులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. కోవూరు, పాటూరు, పోతిరెడ్డిపాలెం గ్రామాల పొలిమేరల్లో వరినాట్లు దెబ్బతింటే తీసు కోవాల్సిన జాగ్రత్తలపై రైతులు దృష్టిపె ట్టారు. భారీవర్షాల వల్ల పారుదల కాలు వలు కూడా ప్రవహిస్తూ పంట పొలాల్ని ముంచెత్తుతున్నాయి. దీంతో వరినాట్లేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

శివయ్యను తాకిన గంగమ్మ

మనుబోలు, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): మనుబోలులోని సంగమేశ్వరాలయానికి రెండు పక్కల రెండు ఏరులు పారుతుంటాయి. అవి నిండినప్పుడు దేవాలయంలో పడిన వర్షపు నీరు పోయే అవకాశం ఉండదు. శనివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఆలయ ప్రాంగణం అంతా వర్షపునీటితో నిండి ఇదిగో ఇలా శివలింగం వద్దకు చేరాయి. ఏమైనా కార్తీకమాసం శివయ్యను తాకి గంగమ్మ పునీతురాలైందని భావించాలి.



శివలింగం చుట్టూ వర్షపునీరు

కుండపోత వర్షం

ఫంగల్ తుఫాన్ ప్రభావంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో చెరువులు నిండాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కాలువలు జోరుగా ప్రవహిస్తు న్నాయి. ఆదివారం చిరుజల్లులు అడపాదడపా పడడంతో ఇంకాస్త చెరువుల్లోకి నీరుచేరింది. పంటపొలాలను వర్షపునీరు చుట్టుముట్టాయి.



న్యూస్ బాక్స్

ప్రత్యామ్నాయ పంటలు.. ఆదాయ మార్గాలు

● మినుము, పెసర సాగు మేలంటున్న శాస్త్రవేత్తలు

పొదలకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు వల్ల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని అనుభవజ్ఞులైన రైతులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సాగునీటి కాలువ లేకుండా వరి పండించలేని రైతులు మెట్ట సాగుకు అదను ఉందన్నారు. గత నెల 15 నుంచి ఈ నెల 15 వరకు పెసర, ఉలవ, నువ్వు సాగు చేసుకోవచ్చని వెల్లడిస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న మినుము, పెసర పంట సాగులో మెలకువలను పాటించాలని సూచిస్తున్నారు. పొదలకూరు ప్రాంతంలో రబీలో వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. సోమశిల నిండుకుండలా ఉండడం, కండలేరు జలాశయానికి సోమశిల నుంచి నీరు విడుదలవుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో జలాశయాలకు అనుసంధానంగా ఉన్న కాలువల ద్వారా సుమారు 14వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు వెల్లడించారు. పొదలకూరు పరిసర ప్రాంతాలు, వెంకటగిరి చుట్టుపక్కల గ్రామాల్లో పెసర, మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈనెల 15 వరకు పెసర, ఉలవ, నువ్వుల పంటలను సాగు చేసుకోవచ్చని తెలియజేస్తున్నారు.

వీధిలైట్ల అధ్యయనంపై హైదరాబాద్‌కు కమిషనర్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరులో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయనున్న వీధి దీపాలకు సంబంధించి మెరుగైన అధ్యయనం కోసం నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ తెలంగాణ రాజధాని హైదరాబాద్ వెళ్లనున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. అక్కడ మూడు రోజులుండి వీధి లైట్ల పనితీరు, అందులో ఉపయోగిస్తున్న టెక్నాలజీ వంటి విషయాలను పరిశీలించి ఏపీ పురపాల శాఖకు నివేదిక అందచేయనున్నారు.

సయ్యద్ సమీకి సన్మానం



సమీహుసేనీని సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ సయ్యద్ హక్కుల ఐక్యవేదిక నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్నబజార్ ఖాజాపీర్ మక్కాన్ అస్గర్ రాజా పీర్ దర్గాలో ఇటీవల డాక్టరేట్ అందుకున్న సయ్యద్ సమీ హుసేనీకి ఆదివారం సన్మానం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సయ్యద్ హక్కుల ఐక్యవేదిక, సాదాత్ మషాయక్లు పీఠాధిపతుల సంఘం సంయుక్తంగా నిర్వహించింది. కేఎస్ఎస్ బాబా సాహెబ్ బంద్గా, సయ్యద్‌సా పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ...

సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం

● ట్రాన్స్‌కో ఏఈఈ పనబాక అనిల్‌కుమార్

మనుబోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్తుపై అవగాహన పెంచుకుని ఏర్పాటు చేసుకుంటే ఉపయోగం. మనుబోలును సోలార్ గ్రామంగా ఎంపిక చేశాం. ప్రతి ఒక్కరు ఇంటి టాప్‌పై సోలార్ అమర్చేందుకు ఏర్పాటు చేసుకుంటే నెలకు 200 యూనిట్లు కరెంటు వస్తుంది. కనుక ప్రతి ఒక్కరు సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈఈ పనబాక అనిల్‌కుమార్ తెలిపారు.

? సోలార్ విద్యుత్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు.

! గ్రామాల్లో ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వాల నిర్ణయం. దీనిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



? గ్రామాల్లో కుప్పలు కుప్పలుగా విద్యుత్ స్తంభాలు ఎందుకు పడి ఉన్నాయి.

! ప్రతి గ్రామానికి 24 గంటలు కరెంటు ఇవ్వాలన్న ఉద్దేశంతో కొన్ని నెలల క్రితం కేంద్రం ఆదేశించింది. అందులో భాగంగా గ్రామానికి అవసరమైన స్తంభాలను దించారు.

? మనుబోలులో రోజూ విద్యుత్ సరఫరాకు ఎందుకు అంతరాయం కలుగుతోంది.

! చెట్లు బాగా పెరిగి ఉన్నాయి. దీంతో పాటు విద్యుత్ తీగలు వదులుగా ఉండడంతో గాలి వీచినప్పుడల్లా రాసుకుని ట్రిప్ అవుతోంది. త్వరలో మనుబోలులో కొత్త తీగలు లాగుతున్నాం

? స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.

! ఇది నిదానంగా సాగే ప్రక్రియ. ఎవరెవరికి అమర్చాలో ఆ కంపెనీలు, విద్యుత్ శాఖ ఆదేశాలతో ఒక్కో దఫా కొంత మందికి ఏర్పాటు చేసుకుంటూ వస్తారు. అంగళ్లు, పరిశ్రమలకు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇళ్లకు జరుగుతోంది.

వెలుగు సంఘం అక్రమాలపై విచారణ చేపట్టాలి

రాపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చిన బృందం త్వరితగతిన విచారణ చేపట్టాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునయ్య కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాపూరు మండల వెలుగు కార్యాలయంలో 2019 జూన్ నుంచి 2024 జూన్ వరకు వివిధ విభాగాలలో జరిగిన అవినీతి అక్రమాలపై నవంబరు 11వ తేదీన ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వగా, స్పందించిన కలెక్టర్ 9 మంది డీఆర్‌డీఏ అధికారులతో విచారణ కమిటీ వేశారన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు తమ కిందిస్థాయి అధికారులపై తమదైన శైలిలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని, దీనిపై కలెక్టర్ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నన్నం మునెయ్య, గిరిజన నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నివేశన స్థలాలు

● వ్యవసాయ కార్మిక సంఘం నేత రమణయ్య

కోవూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పేదలకిచ్చిన నివేశన స్థలాలు నిరుపయోగంగా మారాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నందిపోగు రమణయ్య అన్నారు. స్థానిక రాళ్లమిట్టలో ఆదివారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థికసహాయం అందించకపోవడంతో నివేశన స్థలాలు ఖాళీగా కన్పిస్తున్నాయని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలన్నారు. ఇంటి వసతి లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడుసెంట్ల భూమిని కేటాయించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు దండూరి కామేశ్వరరావు, ఏకుల



పోలయ్యను అభినందిస్తున్న నందిపోగు రమణయ్య

లక్ష్మయ్య, చౌటూరు వెంకటేశ్వర్లు, కర్లగుంట శ్రీనివాసులు, టీ కరుణ, సీహెచ్ మణెమ్మ పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైె వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన పోలయ్యను అభినందించారు.

గిరిజన కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

తోటపల్లిగూడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పంచాయతీ రవీంద్రపురం ప్రాంతంలో తుఫాన్ తాకిడికి గురైన దాదాపు 50 గిరిజన కుటుంబాలకు ఆదివారం తహసీల్దారు టీవీఎస్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ తాకిడికి గురైన గిరిజనులను గుర్తించి వారిని చెన్నపల్లిపాలెం హైస్కూల్‌లో పునరావాసం కల్పించినట్లు తెలిపారు. వారు వారి గృహాలకు వెళ్లడంతో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో వారికి అవసరమైన బియ్యం, నూనె ఇతర నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు

మాగుంట సుబ్బరామిరెడ్డికి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని ఎస్-2 థియేటర్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబు యాదవ్, పత్తి రవీంద్ర బాబు, బాలసుధాకర్, ఏసునాయుడు, ఓబుల్‌రెడ్డి, ఉడతా వెంకట్రావు, పుట్టా విజయ కుమార్ రెడ్డి, కట్టా చంద్ర శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సురేంద్రరెడ్డి, కొండూరు రాంప్రసాద్, వీ రవీంద్ర రెడ్డి, వై విజయభాస్కర్ రెడ్డి, కే విజయభాస్కర్‌రెడ్డి, పోతిరెడ్డి కమలాకర్ రెడ్డి పాల్గొని సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్-2 సిబ్బంది, పాల్గొన్నారు.



మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో నాయకులు

ధర్మ పరిరక్షణకు సమష్టిగా ఉండాలి

● రాజరాజేశ్వరి ఆనంద స్వామీజీ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణ కోసం అందరూ సమష్టిగా ఉండాలని రాజరాజేశ్వరి పీఠం ఆనంద స్వామీజీ అన్నారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నేత యుగంధర్ మాట్లాడుతూ దేవాలయాలలో ఉన్న అన్య మతస్థులను తొలగించాలన్నారు. దేవాలయాల్లో భజనలు, కీర్తనలు, ధర్మ ప్రసంగాలు నిర్వహిస్తూ ప్రతి కుటుంబం వారంలో ఒకసారి గుడికి వెళ్లి దైవ దర్శనం చేసుకోవాలని కోరారు. 'మన దీక్ష.. దేవాలయం రక్ష' అనే నినాదంతో జనవరి 5నుంచి విజయవాడలో జరిగే సమ్మేళనంలో హిందువులంతా పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర గోరక్ష ప్రముఖ్ శశి, కేతరాజు కేశవయ్య, వెంకటనాథ్, హైందవ శంఖారావం సహ కన్వీనర్ కనిగెల్పుల గిరి, తదితరులు పాల్గొన్నారు.




హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాజరాజేశ్వరి ఆనంద స్వామీజీ

'తెలుసుకో సీమ చరితం' ఆవిష్కరణ



తెలుసుకో సీమ చరితం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కవులు, సాహితీవేత్తలు, ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పుర మందిరం వర్ధమాన సమాజ భవనంలో ఆదివారం రచయిత పెను పుట్టా రచించిన తెలుసుకో సీమ చరితం శతక పద్య పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు ఎంఆర్ ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పుస్తకావిష్కరణ అనంతరం పద్యా కళాపరిషత్ కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, విశాలాక్షి మాస పత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, పెన్నారచయితల సంఘం గౌరవాధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షుడు ఇంద్రగంటి మధుసూదన్, రామకృష్ణ సేవా సమితి ఉపాధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి ఆ శతక పద్యాలను సమీక్షించారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, పెనుపుట్టా చదువుకున్న గండిపాలెం పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



స్థానికుల దర్శనానికి నేడు టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికుల దర్శనానికి సంబంధించి సోమవారం తెల్లవారుజాము 3 నుంచి 5 గంటల మధ్య ముందు వచ్చిన వారికి తొలి ప్రాధాన్యతతో టోకెన్లు జారీ చేయనున్నారు. గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ఉన్న స్థానికుల దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలని ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన స్థానికులకు ఉచిత దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తిరుమలలో 500, తిరుపతిలో 2,500 టోకెన్లు జారీ చేయనుంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమల స్థానికులకు తిరుమల బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్, తిరుపతి మహతి ఆడిటోరియంలో టోకెన్లు జారీ చేస్తారు. ఒరిజనల్ ఆధార్ ఉంటేనే ఇస్తారు. టోకెన్లు పొందిన వారు మంగళవారం ఒరిజనల్ ఆధార్ కార్డుతో తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఫుట్‌పాత్ హాల్ (దివ్యదర్శనం) క్యూలోకి ప్రవేశించాలి. ఈ కోటాలో ఒకసారి టోకెన్ పొందితే 90 రోజుల(3 నెలలు) వరకు అవకాశం ఉండదు.

నేడు సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో సూళ్లూరుపేట సత్యసాయి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ యథావిధిగా కొనసాగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ముంచెత్తిన ఫెంగల్

నీట మునిగిన 3,800 హెక్టార్ల పంటలు

నేలకొరిగిన 35 విద్యుత్ స్తంభాలు

తిరుమల ఘాట్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

కాళంగి, అరణియార్, మల్లెమడుగు గేట్లు ఎత్తివేత

మూడు చెరువులకు గండ్లు

పోటెత్తిన జలపాతాలు

సూళ్లూరుపేట, తడ, శ్రీకాళహస్తి, డీవీసత్రం, నాయుడుపేట మండలాలపై తీవ్ర ప్రభావం

స్వర్ణముఖి నది పరవళ్లు



కపిలతీర్థం జలపాతంలో నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన పాము



పుత్తూరు మండలంలో పొంగిపొర్లుతున్న నేసనూరు కలుజు



పుత్తూరు మండలం పిళ్లారిపట్టు కాజువే మీదుగా పరవళ్లు తొక్కుతున్న అరుణానది

తిరుపతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ జిల్లాను ముంచెత్తుతోంది. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలపాతాలు హోరెత్తుతున్నాయి. 3,800 హెక్టార్లలో వరి, వేరుశనగ, మినుము పంటలు నీటమునిగాయి. వంద ఎకరాలకు పైగా ఉద్యాన పంటల్లో నీరు చేరాయి. ఈదురుగాలులకు 35 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తుఫాన్ వల్ల దాదాపు రూ.50 లక్షల వరకు నష్టం జరిగిందని విద్యుత్ శాఖ అంచనా వేసింది. వరదనీరు పోటెత్తడంతో కాళంగి, అరణియార్, మల్లెమడుగు గేట్లు ఎత్తివేశారు. పెళ్లకూరు మండలం కొత్తూరు కొర్రపాటి చెరువుకు గండిపడింది. జిల్లాలో పెద్దచెరువైన చెంబేడు చెరువు కట్ట కుంగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణముఖి జలకళతో ఉట్టిపడుతోంది. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరమ్మతుల కోసం రూ.45 లక్షలు అవసరమని ఆర్అండ్‌బీ అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుపతిలోని కపిల తీర్థం, మాల్వాడిగుండం జలపాతాలు హోరెత్తుతున్నాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో జనజీవనం స్తంభించింది. చలికి జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. గూడూరు ఆదిశంకర కళాశాల సమీపంలో పంబలేరు చట్టాపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీకి వరద పెరగడంతో 8 గేట్లు ఎత్తివేశారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

● తిరుపతి, తిరుమలపై తీవ్ర ప్రభావం

తుఫాన్ ఈదురు గాలులకు ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వంద అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ పతాకం పేలికల్లా చిరిగిపోయింది. ఆదివారం ఉదయం గమనించిన అధికారులు దాన్ని తొలగించారు. తిరుమలలో రెండో రోజూ ఎడతెరపిలేని వర్షంతో రెండవ ఘాట్ రోడ్డులో కొండ చెరియలు విరిగిపడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రొక్లెయిన్లతో బండరాళ్లను ఎప్పటికప్పుడు తొలిగించారు. పాపవినాశనం రోడ్డు చెట్ల కొమ్మలు విరిగిపడి అస్తవ్యస్తంగా మారింది. కపిల తీర్థం నుంచి ప్రవహించే వర్షపునీరు మాల్వాడి గుండం కాలువ మీదుగా పొంగి ఉధృతంగా ప్రవహించింది.

● గేట్లు ఎత్తివేత

తిరుమలలో గోగర్భం, ఆకాశ గంగ, పాపవినాశనం డ్యాములు జలకళను సంతరించుకున్నాయి. నీటి మట్టం పెరగడంతో గోగర్భం డ్యామ్‌లో అధికారులు ఓ గేటును ఎత్తివేయాల్సి వచ్చింది. సూళ్లూరుపేట కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి మీదుగా నాయుడుపేట వైపు వెళ్లే స్వర్ణముఖి పరవళ్లు తొక్కింది. తడ మండలంలో చెరువులు నిండుకుండను తలపించాయి. పాముల కాలువ, కరిపేటి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెళ్లకూరు మండలం కొత్తూరు కొర్రపాటి చెరువుకు గండిపడింది. రేణిగుంట మండలం మల్లిమడుగు డ్యామ్‌లోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది. 5,350 క్యూసెక్కులకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 5,350 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 5,550గా ఉంది. పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన కొట్టుకుపోవడంతో కాళంగి ఏరు ఉధృతంగా పారుతోంది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్‌లోకి ఏడు అడుగుల నీటిమట్టం పెరిగింది. మూడు రోజుల క్రితం 841 అడుగుల నీటి మట్టం ఉండగా సాయంత్రానికి 847 అడుగులకు పెరిగిందని అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల నుంచి డ్యామ్‌లోకి వరద నీరు వస్తోంది.



నాయుడుపేట మండలం మేనకూరు వద్ద నీట మునిగిన పంట పాలాలు

● పంట నష్టం... రైతు కష్టం

తుఫాన్ ప్రభావం తూర్పు మండలాలపై తీవ్రంగా కనిపించింది. గూడూరు, చిట్టమూరు, కోట, నాయుడుపేట మండలం మేనకూరు ప్రాంతాల్లో వర్షాలకు వరిపైరు నీట మునిగింది. ఖరీఫ్ సీజన్లో తుఫాన్‌కు ముందు వరి నాటిన రైతులు లబోదిబోమంటున్నారు. కేవీబీపురం మండలం జయలక్ష్మీపురంలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గూడూరు మండలం చెన్నూరు రామలింగయ్య కాలనీలోకి వరదనీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. టీడీపీ నాయకుల చొరవతో వదరనీటి నుంచి వారికి ఉపశమనం కలిగింది.

● నేడు కూడా వర్షాలు

ఫెంగల్ తుఫాన్ తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో సోమవారం కూడా జిల్లాలో ఓ మోస్తరు వర్షపాతం నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. అత్యధికంగా వడమాలపేటలో 51.8 మి.మీ, అత్యల్పంగా దొరవారిసత్రం 3.8మి.మీ వర్షపాతం నమోదైంది. కేవీబీపురం 42.4, నాగలాపురం 39.8, తడ 28.4, వరయ్యపాళెం 28.2, వెంకటగిరి 27.8, రామచంద్రాపురం 27.2, పుత్తూరు 24.2, చిన్నగొట్టిగల్లు 22.8, పాకాల 21.2, నారాయణవనం 20.2 మి.మీ చొప్పున వర్షాలు పడ్డాయి. జిల్లాలో సగటు వర్షపాతం 18.6మి.మీగా నమోదైంది.



తిరుమల ఘాట్‌లో రాళ్ల తొలగింపు



చిల్లకూరు మండలం వరగలిక్రాస్ రోడ్డు సమీపంలోని వైఎస్సార్ కాలనీలోకి చేరిన వర్షపు నీరు



నిండుకుండలా గోగర్భం డ్యాం

తిరుమలలో నిండుతున్న జలాశయాలు

గోగర్భం డ్యాం గేట్లు ఎత్తివేత

200 రోజుల వరకు నీటికి దిగుల్లేదు

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై జలాశయాలు నిండుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఐదు డ్యాములు జలకళను సంతరించుకున్నాయి. తిరుమల అడవుల నుంచి నీరు జోరుగా ప్రవహిస్తుండటంతో డ్యాములన్నీ నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుత నీటి నిల్వలతో 200 రోజుల వరకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు సమకూరింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గోగర్భం డ్యాం నిండిపోవడంతో ఓ గేటు ఎత్తివేశారు. ఇక ఆకాశగంగ మినహా మిగిలిన డ్యాములు కూడా ఆదివారం అర్థరాత్రికి పూర్తి స్థాయిలో నిండే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమలలో నీటి సమస్య ఏర్పడుతుందని రెండు నెలల క్రితం కంగారుపడిన అధికారులు డ్యాములన్నీ నిండుతుండటంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు...

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240(లక్షలగ్యాలన్లు)	4,345
కుమారధార	4,25	2,372
పసుపుధార	1,287	950
గోగర్భం	2,833	2,833
ఆకాశగంగ	685	306

పంట పొలాల్లో వింత చేప



వరదయ్యపాళెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం గ్రామానికి వెళ్లే దారి పక్కనే పొలాల్లో విచిత్ర చేప రైతుకు చిక్కింది. ముళ్లతో నిండి ప్రత్యేక ఆకృతిలో ఉన్న ఈ చేపను స్థానికులు వింతగా చూస్తున్నారు.

శ్మశానానికి వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే!




ఏటిలో శవాన్ని మోసుకెళుతున్న పుట్టావాండ్లపల్లె దళితులు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ పుట్టావాండ్లపల్లెకు చెందిన దళితులు అంత్యక్రియలకు అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామానికి ఉత్తరం వైపున గాజులేరు అవతల శ్మశానం ఉంది. ఏటికి కల్వర్టు లేకపోవడంతో దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామానికి చెందిన చిన్నస్వామి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నడుము లోతు నీటిలో శవాన్ని మోసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఏటిపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉధృతంగా తలకోన జలపాతం

వారం రోజులు పర్యాటకులకు నో ఎంట్రీ



ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అడవుల్లోని వాగులు, వంకల నుంచి నీరు భారీగా వస్తుండడంతో జలపాతం సముద్ర మట్టానికి 750 అడుగుల నుంచి జాలువారుతోంది. ముందు జాగ్రత్త చర్యగా పర్యాటకులను వారం రోజుల పాటు నిషేధించినట్లు చామల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రమణ తెలిపారు.

హిజ్రాల్లో ఆధిపత్య పోరు

పాతకక్షల నేపథ్యంలోనే హాసిని హత్య ● 12మంది నిందితుల అరెస్టు

● పరారీలో ప్రధాన నిందితుడు, మరో ఇద్దరు ● తెరవెనుక సూత్రధారి అలేఖ్య



హాసిని(ఫైల్‌ఫొటో)

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హాసిని... ఈమె ఓ ట్రాన్స్‌జెండర్... అనతికాలంలోనే రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ట్రాన్స్‌జెండర్లకు నాయకురాలిగా ఎదిగింది.. ఆమె ఉంటే తాము ఎదగలేమని మరికొందరు ట్రాన్స్‌జెండర్లు భావించారు.. హాసినీని ఎలాగైనా అంతమొందించాలని పగబట్టారు.. ఆమెతో వైరమున్న మరికొందరితో చేతులు కలిపారు. అందరూ కలిసి కిరాయి హంతకులతో రూ.20 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ హంతక ముఠా పక్కా స్కెచ్‌తో హాసినీని కత్తులతో విచక్షణగా రహితంగా పొడిచి హత్య చేసింది. ఇటీవల జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. సుపారీ ఇచ్చిన ట్రాన్స్‌జెండర్ నాయకురాలు అలేఖ్య, మరో హిజ్రాతో పాటు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో 15మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతను చిక్కితే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

● కుగ్రామం నుంచి అంతర్రాష్ట్ర స్థాయికి..

నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని గ్రామస్థాయి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ హిజ్రాలకు నాయకురాలిగా ఎదిగింది. అది చూసి ఓర్వలేక ఆమె బతికి ఉంటే తమ మనుగడ ప్రశ్నార్థకమని మాజీ నాయకురాళ్లు భావించారు. పక్కా స్కెచ్ వేసి అంతమొందించారు.

● రూ.20 లక్షల సుపారీ

నెల్లూరు నగరానికి చెందిన పాత నేరస్థుడు భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా దొరతోపు కాలనీకి చెందిన వంశీకృష్ణ, అల్లీపురానికి చెందిన కార్తీక్, నాలుగో మైలుకు చెందిన సుబ్రహ్మణ్యం, మస్తాన్ వలీ, వెంకటాద్రి, ఇందుకూరుపేట మండలం జేజేపేటకు చెందిన వంశీ, నాలుగోమైలుకి చెందిన ఓ బాలుడిని, మార్టూరు మండలం ఇసుకదర్శికి చెందిన ఎం రామును ట్రాన్స్‌జెండర్లు సంప్రదించారు. హాసినిని అడ్డుతొలగిస్తే రూ.20 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొని, కొంత నగదు ముందుగానే ఇచ్చారు. దీంతో నిందితులు నెల నుంచి హాసిని కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె పక్కనే ఉండే ఓ హిజ్రాను మచ్చిక చేసుకుని హాసిని కదలికలు తెలుసుకుంటూ వచ్చారు. ఈ నెల 26వ తేదీ హాసిని స్వగ్రామంలోని ఆలయం వద్దకు వెళ్లి వస్తుండగా టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద కాపు కాచి పాశవికంగా హత్యచేసి పరారయ్యారు.

● అతను దొరికితే..

ఈ కేసులో సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు మాత్రం దొరకలేదు. ఆ వ్యక్తి ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు హిజ్రా నాయకురాలు అలేఖ్య సాయంతో కొందరు హిజ్రాలను తెలంగాణ నుంచి పిలిపించి ఇక్కడ కార్యక్రమాలను ఏర్పాటు చేయించారు. మన రాష్ట్రంలో హిజ్రాలు లేరా.. పక్క రాష్ట్రం నుంచి తెప్పించాల్నా.. అంటూ హాసిని అప్పుడు వాళ్లతో గొడవపడి అతడిపై దాడి చేయించిందని, దీంతో అతను పగ పెంచుకొని హత్యకు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో పలు చిక్కుముడులు వీడాల్సి ఉంది. అసలు హాసిని ప్రయాణం చేసిన కారు డ్రైవర్ ఏమయ్యాడు. ఈ కేసులో ఎంతమంది పాత్ర ఉందనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు దొరికితే అన్నీ బయటకు వస్తాయి.

రామదూతపై అభయ ప్రదాత



హనుమంత వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి ఏడు గంటలకు కోదండరాముడి అలంకారంలో పద్మావతీ అమ్మవారు హనుమంత వాహనంపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వాహన సేవ ప్రారంభం నుంచి ముగిసే వరకు వర్షం పడుతూనే ఉంది.

కల్పవృక్షంపై కల్పవల్లి

ఉదయం చర్నాకోలు, దండం ధరించి రాజమన్నార్ అలంకరణలో కల్పవృక్ష వాహనంపై అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారిని అద్దాల మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి, అలంకరించారు. గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయర్ స్వాముల దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజనలు, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణ నడుమ వర్షపు జల్లుల మధ్య వేడుకగా అమ్మవారికి వాహనసేవ జరిగింది. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు.



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు పల్లకీ ఉత్సవం
- సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం
- రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సుధాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లి వద్ద మద్యం దుకాణం సమీపంలో రాయపు సుధాకర్(49) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... సిద్ధవరం దళితవాడకు చెందిన సుధాకర్ శనివారం తన స్నేహితులతో కలిసి గోవిందపల్లిలో ఉన్న దుకాణం వద్ద మద్యం సేవించారు. అక్కడ నుంచి స్నేహితులు, సుధాకర్ స్వగ్రామమైన సిద్ధవరం వెళ్లారు. మేతకుపోయిన గేదెలు రాలేదని భార్య చెప్పడంతో సుధాకర్ వాటిని వెతికేనందుకు పొలాల్లోకి వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో భార్య, పిల్లలు గబరాపడ్డారు. ఆదివారం ఉదయం గోవింపల్లిలోని మద్యం షాపు సమీపంలో ఉన్న నీటి దొరువులో సుధాకర్ మృతదేహం తేలియాడుతుండటంతో పశువుల కాపరులు గుర్తించారు. ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకొని సుధాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

వైభవంగా ఆకాశదీప మహోత్సవం



స్వర్ణముఖినదిలో ఆకాశదీపం వదులుతున్న సుధీర్‌రెడ్డి దంపతులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరిరోజు ఆదివారం రాత్రి ఆలయంలో ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గూడూరు సుధీర్‌రెడ్డి, సాహిత్యరెడ్డి దంపతులు స్వర్ణముఖి నదిలో ఆకాశదీపాన్ని వదిలారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడూరు ప్రభావతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు బాలాజీస్వామి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ సంస్థకు అవార్డు



డీఎంహెచ్‌వో చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సహదేవయ్య

నాయుడుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, క్షయ పట్ల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నవజీవన్ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవ అవార్డు అందజేశారు. ఆదివారం ఎయిడ్స్ డే సందర్భంగా తిరుపతిలోని ఎస్వీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో నవజీవన్ సంస్థ అధ్యక్షుడు సహదేవయ్య, డైరెక్టర్ కె.విక్టోరియా, మేనేజర్ కవితకు ఉత్తమ సేవా అవార్డును డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.శ్రీహరి, డీఎల్‌ఏటీవో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అందజేశారు. హెచ్‌ఐవీ, క్షయ పట్ల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటి నిర్మూలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది కవిత, మంజుల, నందిని, శ్రావణి, సాయిలక్ష్మి, ఐశ్వర్య, ఏస్తేరు రాణి, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాస పూజలు

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివాలయాల్లో నెల రోజులపాటు జరిగిన కార్తీక మాస పూజలు ఆదివారంతో ముగిశాయి. గూడలిలోని కామాక్షీదేవి సమేత సంఘమేశ్వర ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్ స్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు జరిగిన కార్తీక మాస ముగింపు పూజలు నిర్వహిచాఆరు. అలాగే కోటలోని సోమేశ్వర ఆలయంలో కార్తీక మాస పూజలు ముగిశాయి. నెలపాటు వ్రతాలతో ఉన్న మహిళా భక్తులు దీక్ష విరమణ చేశారు.



ప్రత్యేక అలంకారంలో సోమేశ్వరుడు

హెచ్‌ఐవీపై అవగాహన కలిగివుండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగివుండాలని ఐసీటీసీ కౌన్సిలర్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లోని ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, వైద్యసిబ్బంది జయలక్ష్మి, రామాంజనేయులు, స్వచంద సంసంస్థ ప్రతినిధులు సుహాసిని, జయచంద్ర పాల్గొన్నారు.

నేడు లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరుగనున్న గజవాహనసేవలో అలంకరించేందుకు తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని సోమవారం ఉదయం శోభాయాత్రగా తిరుచానూరుకు తీసుకెళ్లనున్నారు. ముందుగా శ్రీవారి ఆలయం నుంచి ఈ హారాన్ని బయటకు తీసుకొచ్చి నాలుగు మాడవీధుల్లో శోభాయత్ర నిర్వహించి తర్వాత తిరుచానూరుకు తీసుకువెళతారు. తిరుచానూరులోని పసుపు మండపం వద్ద హారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళతారు. ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణగా గర్భాలయానికి తీసుకెళ్లి మూలమూర్తికి లక్ష్మీకాసుల హారాన్ని అలంకరిస్తారు.

విడవని వాన



నాయుడుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడికాలువ

- ఉధృతంగా వాగులు, వంకలు
- చెరువులకు జలకళ
- నీటమునిగిన పంట పొలాలు
- పలు గ్రామాలకు ఆగిన రాకపోకలు

కోట, వాకాడు, పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి టౌన్, బాలాయపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆదివారం నాడూ వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి తీరం దాటినప్పటికీ మోస్తరు నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. కోట మండల పరిధిలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లి పాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రంలో అలల ఉధృతి తగ్గలేదు. ఆరు రోజులుగా మత్స్యకారులు వేటకు విరామం పలికారు. బకింగ్‌హామ్ కెనాల్ వరదనీటితో నిండుకుండలా ఉండటంతో గిరిజనులు చేపలవేటకు వెళ్లలేదు. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖినదిలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పొటెత్తింది. స్వర్ణముఖినది చల్లకాలువలోకి వచ్చే క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న కలుజు వరదనీటితో పరవళ్ల తొక్కుతోంది. ● వాకాడు మండలంలోని ముట్టెంబాక, కల్లూరు, రుద్రవరం, తిరుమూరు, సిద్ధిగుంటపాళెం, కొత్తపాళెం, బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెం, కొండూరు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. బాలిరెడ్డిపాళెం వంతెనపై మూడు అడుగుల మేర వరద ప్రవహించడంతో గ్రామంలోకి నీళ్ల రాకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. వంతెనకు అటువైపుగా ఉన్న గంగన్నపాళెం వద్ద ఉప సర్పంచు మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వంతెనకు అడ్డంగా మట్టి కట్టలను ఏర్పాటు చేశారు. దిగువ ప్రాంతాలైన గంగన్నపాళెం, జెమిని కొత్తపాళెం, పామాంజి, వాలమేడు, తూపిలిపాళెం, కోట మండలానికి చెందిన పుచ్చలపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పుటేరు, కాలువలు, స్వర్ణముఖి నదుల నుంచి వరదనీరు సముద్రంలోకి చేరడంతో తీరమంతా బురదమయంగా మారింది. తూపిలిపాళెంలో 20 ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ఆయా కుటుంబాలకు పునరావాస కేంద్రంలోకి తరలించారు. స్వర్ణముఖి బ్యారేజీకి వరదనీటి ప్రవాహం పెరగడంతో ఆదివారం 8 గేట్‌లను ఎత్తి నీటిని దిగువకు వదిలామని ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు. మరో మూడు రోజుల పాటు స్వర్ణముఖి బ్యారేజీకి వరద ప్రవాహం ఉంటుందని, దిగువ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ● పెళ్లకూరు మండలంలోని కొత్తూరు కొర్రపాటి కుంటకు గండి పడింది. కుంట దిగువున ఉన్న సుమారు 15 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఇసుక బస్తాలు అడ్డుగా వేసి గండిని పూడ్చారు. చెంబేడు చెరువు కట్ట కుంగింది. ● సూళ్లూరుపేటలో తేలికపాటి జల్లులతో కూడిన వర్షం పడింది. కేవీబీ పురంలో కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగికి అనుసంధామైన నెర్రికాలువ, పాముల, పుచ్చా కాలువలు పొంగి పొలాలు, రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కోటపోలూరు వద్ద పుచ్చాకాలువ ఉధృతి తగ్గకపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. పిండిపాలెం వద్ద చిన్నకాలువ పొంగి ప్రవహించడంతో శ్రీధనమల్లికి రాకపోకలు ఆగిపోయాయి. కోటపోలూరు, ఎన్‌వీకండ్రిగ వద్ద పొలాలు నీట మునిగాయి. ● తడ మండలంలో కొద్దిపాటి చిరుజల్లులు మాత్రమే కురిశాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పాముల కాలువ, కరిపేటి కాలువ ఉప్పొంగగా, చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. మండలంలో సుమారు 400 ఎకరాల వరిపంట నీట మునిగినట్లుగా ప్రాథమిక సమాచారం. కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, చేనిగుంట, వాటంబేడు ప్రాంతాలలో వర్షపునీరు పంట పొలాలను ముంచెత్తింది. వెండ్లూరుపాడు - కాదలూరు మధ్య రోడ్డుపై వర్షపునీరు పెద్ద ఎత్తున పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ● నాయుడుపేట మండలంలో స్వర్ణముఖినది, మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగాయి. చెరువులు, వాగులు, వంకలు, నదులు జలకళతో తొణికిసలాడుతున్నాయి ● దొరవారిసత్రం మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఉప్పొంగిన వాగులు, వంకలు ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టాయి. శనివారం నుంచి ఉధృతంగా ప్రవహించిన కాళంగి నది ఉధృతి తగ్గడంతో తనియాలి వద్ద వంతెనపై రాకపోకలు కొనసాగాయి. అలాగే వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెనపై కూడా ప్రవాహం తగ్గింది. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట - కోట ఆర్‌అండ్‌బీ రహదారి ప్రవహిస్తున్న కన్నాకాలువపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు సాగాయి. ● గూడూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. పైప్రాంతాల నుంచి వస్తున్న వరద పంబలేరు వాగులోకి చేరుతుండడంతో చప్టాపై రాకపోకలను నిలిపివేశారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ చప్టాపై రాకపోకలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మిటాత్మకూరు, సంతదాసుపల్లి, పగడాలపల్లి, విందూరు తదితర గ్రామాల్లో నారుమళ్లు నీట మునిగాయి. సుమారు 600 ఎకరాలకు పైగా నారుమళ్లు నీటి మునిగి వుంటాయని అంచనా వేస్తున్నారు. అలాగే 40 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. చెన్నూరులో రామలింగయ్య కాలనీ, జగనన్న కాలనీల్లోకి వర్షపునీరు చేరుకోవడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. టీడీపీ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తోడేటి శివకుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో నీటిని తొలగించారు. ● చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వర్షనీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. మండల కేంద్రమైన చిల్లకూరులోనూ పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరి సామగ్రి నీట మునిగింది. ● వెంకటగిరి మండలంలో అన్ని చెరువులు సగం వరకు నిండాయి. వెలుగొండ అడవుల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో కౌవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ● బాలాయపల్లి మండలంలో కైవల్యానది చప్టాపై వరద ప్రవాహం పెరగడంతో నిండలి, వాఖ్యం, దగ్గవోలు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా సాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీసుల సిబ్బంది పహారా కాశారు.



వాకాడు: తూపిలిపాళెం తీరంలో ఎగిసిపడుతున్న అలలు



దొరవారిసత్రం: తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద ప్రవాహం






వాకాడు: తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో వసతుల గురించి తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారులు - గూడూరు: మిటాత్మకూరులో నీటమునిగిన నారుమళ్లు - సూళ్లూరుపేట: వరదనీటిలో వరిపంట - పెళ్లకూరు: కొత్తూరు కొర్రపాటి కుంటకు గండి

బ్యాటరీల రీసైక్లింగ్ అవకాశాల పరిశీలన

నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు

తడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీలను రీసైక్లింగ్ చేసి మళ్లీ వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నామని నిప్పో పరిశ్రమ హెడ్ డి.నాగరాజు వెల్లడించారు. నిప్పో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి 99వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఫౌండర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మొట్టమొదటగా అడుగులు వేసి వ్యక్తి ఓబుల్‌రెడ్డి అని కొనియాడారు. 44 ఏళ్ల నిప్పో ప్రస్థానంలో ప్రస్తుతం రూ.500 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని, రాబోయే ఐదేళ్లల్లో రూ.1000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పాడై పోయిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా మని, త్వరలోనే ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో బ్యాటరీలను రీసైక్లింగ్‌కు పూనుకున్నామని తెలిపారు. అనంతరం కార్మికులు, ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఏజీఎం పి.నాగరాజు, హెచ్‌ఆర్ రమేష్, షణ్ముగమణి, శంకర్‌బాబు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఓబుల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిప్పో ఉద్యోగులు

నాగేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర కలశపూజ



కలశాలను ప్రదర్శనగా తీసుకెళ్తున్న భక్తులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అష్టోత్తర కలశ స్నపన పూజ వైభవంగా చేశారు. ఆలయం ముందు 108 కలశాలలో ద్రవ్యాలను నింపి కలశ స్నపన పూజ చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్.కృష్ణమూర్తి, ఆలయ అర్చకుడు సునీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అయ్యప్పస్వామి పూజోత్సవం

నాయుడుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం వచ్చేనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. 3, 4 తేదీల్లో జరగాల్సిన జ్యోతి పూజోత్సవం, అఖండ కర్పూరజ్యోతి మహోత్సవాలు తుఫాన్ కారణంగా వాయిదా వేశామని, భక్తులు గమనించాలని కోరారు.

వసతిగృహ పరిశీలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాసాగార్డెన్‌లో ఉన్న బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ఆదివారం పరిశీలించారు. అక్కడ బాలికలకు అందుతున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. బాలికలను భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు.

కుంగిన లారీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీ రోడ్డులో ఓ సిమెంటు లారీ కుంగింది. బత్తెయ్య నాయుడు ఆస్పత్రి వద్ద ఆదివారం సాయంత్రం ఓ లారీ రోడ్డు పక్కన కుంగిపోయింది. రద్దీ వేళలో భారీ వాహనం పట్టణ నడిబొడ్డున నిలిచిపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. పక్కనే ఆర్టీసీ బస్టాండు ఉండటంతో కాసేపు అంతరాయం ఏర్పడింది. వాహనం నుంచి లోడును కాసేపటికి దించివేయడంతో ప్రమాదం తప్పింది.



మోటారు సైకిల్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు గాయాలు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బ్రిడ్జి సమీపంలో మోటరు సైకిల్ అదుపుతప్పిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం మాంబట్టులోని ఓ కర్మాగారంలో పని చేస్తారు. ఆదివారం విధులు ముగించుకొని మోటరు సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్తుండగా బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మల్లికార్జున్, సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరరాఘవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో వీరరాఘవస్వామి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం చలివేంద్రం వద్ద వెలసిన వైద్య వీరరాఘవులస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాధితులను ఆదుకుంటాం

వరదయ్యపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాను బాధితులను ఆదుకుంటామని తహసీల్దారు రాజశేఖర్ చెప్పారు. ఆదివారం ఆయన కంచరపాళెం ఎస్టీకాలనీలో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలకు, కూలిన ఇళ్లపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బీజీఆర్ కాలనీవాసులకు, అదే విధంగా చిన్నపాండూరు షికారీలకు ఆర్‌బీకేలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ మహ మ్మారిని తరిమికొట్టగలమని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యాధి కారి రమేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఐసీటీసీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ భారతి పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదికి జలకళ



కప్పగుంటకండ్రిగ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

పెళ్లకూరు, డిశంబరు 1(ఆంధ్రజ్యోతి): పెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. మండలంలో ముమ్మారెడ్డిగుంట గ్రామం నుంచి పుల్లూరు, కలవకూరు, పెళ్లకూరు మీదుగా తాళ్వాయిపాడు వరకు సుమారు 20 కిలోమీటర్లు విస్తరించిన స్వర్ణముఖి నది అనేక గ్రామాలకు ప్రధాన సాగు, తాగునీటి వనరుగా ఉంది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో స్వర్ణముఖినది పరవళ్ల తొక్కుతోంది. చెరువులు నిండడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి పంటల సాగుకు ఇబ్బందులు తొలగిపోయతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు,

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బాలిరెడ్డిపాళెం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

వాకాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎగువున కురిసిన వర్షాలకు స్వర్ణముఖినదిలోకి వరద ప్రవాహం వస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సూచించారు. ఆదివారం రాత్రి 9 గంటలకు జోరువానలో బాలిరెడ్డిపాళెం గ్రామస్తులతో కలిసి సబ్ కలెక్టర్ స్వర్ణముఖినది వరదనీటి ప్రవాహనికి అడ్డుగా వేసిన ఇసుక బస్తాలను పరిశీలించారు. గతేడాది మిచౌంగ్ తుఫాన్‌తో నష్టం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. వరద ప్రవాహం నేటి నుంచి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, ప్రజలు అధైర్యపడ్డవద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దారు రామయ్య, డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్, ఇరిగేషన్ ఏఈలు కృష్ణయ్య, శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెరువులను పరిశీలించిన అధికారులు



సముద్రం ముఖద్వారాలను పరిశీలిస్తున్న అధికారులు

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 44 చెరువులను తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, పలువురు వీఆర్వోలు పరిశీలించారు. ప్రస్తుత వర్షాలకు 30 చెరువుల వరకు పూర్తిగా నిండినట్లు గుర్తించారు. అదేవిధంగా పలు చెరువుల తూములకు గండ్లు పడకుండా తాత్కలిక మరమ్మతులు, రింగ్‌బండ్‌లు వేయాలని ఇరిగేషన్ అధికారులకు తహసీల్దారు సూచించారు. అలాగే చిట్టేడు, చంద్రశేఖరపురం, గోవింద పల్లి, ఉత్తమనెల్లూరు, కోట చెరువులను అధికారులు పరిశీలించారు.